క్లుప్తంగా

దొనకొండ వాసికి డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న ఖాదర్‌బాషా

దొనకొండ: మండల కేంద్రం దొనకొండకు చెందిన షేక్ ఖాదర్‌బాషా డాక్టరేట్ పట్టాకు అర్హత సాధించారు. ఎంబీఏలో మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశారు. మేనేజ్‌మెంట్ విభాగంలో 7 సంవత్సరాలు రీసెర్చ్ చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. కేఎల్ యూనివర్సిటీ గుంటూరు వారి 14వ స్నాతకోత్సవంలో భాగంగా దొనకొండ గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బాషాకి మేనేజ్‌మెంట్ విభాగంలో డాక్టర్ అకొండి శ్రీకాంత్ అసోసియేట్ ప్రొఫెసర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మార్కెట్ కార్యకలాపాల్లో లోపాలు అనే ఇతివృత్తంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. స్నాతకోత్సవం సందర్భంగా ఆదివారం కేఎల్ యూనిర్సిటీ వైస్ చాన్సలర్ కె.పార్థసారధి వర్మ, ప్రొవైస్ చాన్సలర్ డా.కె.వెంకటరామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖర్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు చేతుల మీదుగా షేక్ ఖాదర్‌బాషా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తాను 7 ఏళ్ల కష్టపడి పీహెచ్‌డీ పట్టా పొందానని, దానికి తమ తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సాహం, సహకారంతో ఈ రోజు పెద్దల చేతులపై పట్టా పొందటం తన అదృష్టమని ఖాదర్‌బాషా తెలిపారు.

పొలాలకు రక్షణ చీరలు



పంటల చుట్టూ రక్షణ కోసం కట్టిన చీరలు

పుల్లలచెరువు: పొలాల్లో సాగు చేసిన పంటలను జంతువులు పాడు చేయకుండా ఉండటం కోసం గ్రామాల్లోని రైతులు పంట పొలాల చుట్టూ చీరలు కడతారు. దీంతో జంతువులు ఆ పక్కకు రావు అనేది రైతుల నమ్మకం. దీనిపై ఒకరు ఏమన్నారంటే తల్లికి చీర ఎంత ముఖ్యమో పంటలకు చుట్టూ కట్టిన చీరలపై పొత్తిళ్లలోని పసికందుకు భద్రతలా తమ పంటకు కూడా నువ్వే సుమా. బూచోడు వస్తే అమ్మ కొంగు చాటున దాచినట్టు.. పరుల పాలిట పడకుండా నువ్వే మాకు చుట్టూ దిష్టి తగలకుండా నరదృష్టి మరల్చేందుకు నువ్వే దిక్కు.. ఆడించి పాలించి లాలించే అమ్మ కొంగువై మాకు హక్కు అన్నారు. పంటలకు దిష్టి తగులకుండా, పసికందును ఎలా చుసుకుంటావో మా పంటలను కూడా అలా చూడుతల్లీ.. అంటూ రైతులు చీరలు కడతారు.

ప్రమాదకరంగా మూల మలుపులు



రహదారుల వెంట అలుముకున్న పిచ్చి మొక్కలు



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

- రోడ్డుకు ఇరువైపులా పనికి రాని పొదలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు

పెద్దదోర్నాల: రహదారికి ఇరువైపులా పనికి రాని మొక్కలు పెరగడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు మలుపుల వద్ద భారీగా పిచ్చి మొక్కలు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు, పాదచారులు కనపడక పోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులోని చింతల, తుమ్మలబైలు, చిన్నారుట్ల తదితర ప్రాంతాల్లోని రహదారుల్లో ఇదే సమస్య ఉందని పలువురు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి శ్రీశైలం వెళ్లే రహదారుల్లోని మార్జిన్లలో పూర్తి స్థాయిలో పనికి రాని పిచ్చి మొక్కలు పెరిగి పోవటం ఇబ్బందిగా మారింది. దీంతో రహదారుల పైకి పిచ్చిమొక్కలు వ్యాపించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవటంతో కొన్ని రోజుల క్రితం ఓ వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయని చెంచు గిరిజనులు పేర్కొంటున్నారు. దీంతో పాటు బుధవారం చింతల ఘాట్ రోడ్డులోని మూలమలుపు వద్ద హఠాత్తుగా ఎదురుగా ఓ వాహనం రావడంతో దాన్ని తప్పించబోయిన ఓ కారు పొదల్లోకి దూసుకెళ్లిందని, అయితే ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకుండా సురక్షితంగా బయట పడ్డారని గిరిజనులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి రహదారుల వెంట మూసుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు.

పిచ్చిచెట్లు అలుముకోవడంతో ప్రమాదాలు: పిచ్చిచెట్లు రహదారుల వెంట అలుముకొని పోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక పోవటంతో అటవీ ప్రాంతంలోకి వెళ్లే పాదచారులు కూడా జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– భూమని వీరన్న, చింతల

తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి: ఘాట్ రోడ్లల్లో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మార్జిన్లలో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక పోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది.

– కుడుముల అరుణమ్మ, చింతల

అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనాలు



చాట్లమడ అగ్రహారంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం



శిథిలావస్థలో మరుగుదొడ్డి

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు, మద్దలకట్ట పంచాయతీ చాట్లమడఅగ్రహారం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిలిచాయి. అర్థంతరంగా భవనాలు నిలిచిపోవడంతో మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలు, పేకాటకు అవి అడ్డాగా మారాయి. రెండు గ్రామాల్లో భవనాలకు మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలు, ప్లాస్టింగ్, నేల బండలు వేయకుండానే వదిలేయడంతో భవనాల చుట్టూ చిల్లకంపతో నిండి ఉన్నాయి. గతంలో మండల సర్వసభ్య సమావేశంలో అంగన్‌వాడీ భవనాలపై ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు చర్చించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించ లేదు. పెద్దారవీడులో అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో, చాట్లమడఅగ్రహారం గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనం ఎదురుగా ఉన్న ఎంపీపీ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. కొందరు అంగన్‌వాడీ భవనంలో మద్యం తాగి అక్కడే బాటిళ్లను, గ్లాసులు పడేస్తుంటారు. బడి గుడి తేడా తెలియకుండా విచక్షణ జ్ఞానాన్ని మరిచి మందుబాబులు ప్రవర్తిస్తున్నారని, రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని గ్రామస్తులు చెబుతున్నారు. చాట్లమడ గ్రామం నుంచి చాట్లమడఅగ్రహారం గ్రామానికి వెళ్లే రహదారి కావడంతో మందుబాబులను చూసి నిత్యం రాకపోకలు సాగించాలంటే భయంగా ఉందని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేసి వాటిలో చిన్నారులకు విద్యను కొనసాగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మాలధారులకు అన్నదానం ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అయ్యప్పలు



భిక్షకు హాజరైన అయ్యప్పలు

- 41 రోజులు నిరంతరం కొనసాగనున్న భిక్ష

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో 41 రోజుల పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఫారెస్టు రేంజి అధికారి జీవన్‌కుమార్, మేజర్ పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావులు ఆదివారం ప్రారంభించారు. నియమ నిష్టలతో అయ్యప్పదీక్ష చేపట్టే స్థానిక అయ్యప్పలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలి వచ్చే అయ్యప్పస్వాములు, భక్తుల సౌకర్యార్థం ఏటా డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 11వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించటం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అధికారులతో పాటు అయ్యప్ప మాలాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. అన్నదాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొగ్గరపు మణికంఠ చంద్రశేఖర్, గురుస్వాములు సాంబశివరావు, పందు స్వామి, కార్యవర్గ సభ్యులు రావిక్రింది రామారావు, గురిజేపల్లి శ్రీనివాసాచారి, బండారు సుబ్బనారాయణ, తిరుమలరెడ్డి జగదీశ్వరరెడ్డి, కానిస్టేబుళ్లు మోహన్, ఆంజిస్వామి, వేణుగోపాల్‌రెడ్డి, అల్లు రమణారెడ్డి, అల్లూరెడ్డి, నారాయణ స్వామి, బొగ్గరపు రమేష్, ఆలయ పూజారి మణికంఠశర్మ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కార్తీక పూజలు చేస్తున్న మహిళలు

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకంలోని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని అన్నసముద్రం చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ఘటాభిషేకం చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. దూపాడు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక పూజల అనంతరం ఆలయాల్లో భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

గుంటి గంగకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం, సోమవరప్పాడు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటిగంగ భవాని అమ్మవారిని, శ్రీ మల్లికార్జునస్వామి వారిని, నాగమ్మ తల్లిని కార్తీక మాసం చివరి రోజు ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పొంగళ్లు పెట్టి, నైవేద్యాలు సమర్పించారు. జంతు బలలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని అర్చకులు పి.విజయలక్ష్మి, ఎం.బాలరాజు, కామేశ్వరశర్మ అలంకరించారు. ఈవో పి.కార్తీక్, ఆర్‌ఏకే ప్రసాదరావు, ఆలయ చైర్మన్ కె.గుర్రుబ్రహ్మం పాల్గొని భక్తులకు వసతులు సమకూర్చారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక అమావాస్య పూజలు



కాళహస్తీశ్వరస్వామి



జ్ఞానప్రసూనాంబదేవి

కురిచేడు: కార్తీక మాసం పూర్తయిన సందర్భంగా అమావాస్య ఆదివారం నాడు స్థానిక శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేయించారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు భక్తులతో అభిషేకాలు, పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

- పేదలపై భారం మోపడం దారుణం
- సీపీఐ కార్యదర్శి గురునాథం



సీపీఐ కార్యదర్శి గురునాథం (ఫైల్)

పుల్లలచెరువు: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం మండల కేంద్రం పుల్లలచెరువులో మాట్లాడుతూ రాష్ట్రంలో 2023–2024 సంవత్సరానికి సంబంధించి రూ9,412 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల వసూలుకు ఈఆర్సీ అంగీకరించడం అత్యంత దారణమన్నారు. డిసెంబర్ ఒకటి నుంచి యూనిట్‌కు 92 పైసలు చొప్పున వసూలు చేసి కోట్ల మేర ప్రజలపై భారం మోపడం దుర్మార్గమని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇలా ప్రజలను నమ్మించి మోసగించడం అన్యాయమన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి పోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర మాత్రం పెరగలేదని చెప్పారు. ఇప్పటికే స్మార్టు మీటర్ల బిగింపును ప్రభుత్వం వేగవంతం చేసిందని, రానున్న రోజుల్లో సెల్, డిష్ టీవీ మాదిరిగా రీచార్జీ చేసుకోవాల్సి వస్తుంద న్నారు. ఈ మీటర్ల ఖరీదును సైతం బిల్లులో వాయిదా పద్ధతిన చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ చార్జీలు పెరుగుదలతో ప్రజలపై మరింత భారాలు పడటం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన



దర్శి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మురళి

దర్శి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా దర్శి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై మురళి హాజరై మాట్లాడుతూ మంచి ఆలోచనతో అవగాహన కలిగించటం అభినందనీయమన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మంచి చెడులను ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకూడదన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదని, తోటి విద్యార్థుల పట్ల మంచిగా మెలగాలని, ర్యాగింగ్‌లకు పాల్పడకూడదని, డ్రగ్సకు అలవాటు పడకూడదని ఆయన సూచించారు. మానవతా సంస్థ తరఫున అనేక మంచి కార్యక్రమాలు చేస్తున్నారని, విద్యార్థులు దాన్ని స్ఫూర్తిగా తీసుకుని పెద్దయ్యాక మంచి కార్యక్రమాలు చేయాలని కోరారు. మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్ కపురం శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ జి.వేణు, సంస్థ బాధ్యులు సుశీలమ్మ, సీహెచ్ బసవయ్య, ఎస్వీఆర్ పాఠశాల డైరెక్టర్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



పెద్దారవీడు: ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

పెద్దారవీడు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంటలో అజల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సిద్ధార్థ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నిశ్శబ్దాన్ని చేదిద్దాం, ఎయిడ్స్‌పై చర్చిద్దాం, టేక్ ది రైట్స్ పాత్, మై హెల్త్ మై రైట్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అజల్స్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



వేనూతల కాటమరాజుస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ దేవత

పెద్దారవీడు: మండల పరిధిలోని గుండంచర్ల పంచాయతీ నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవత, ఎస్.కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించారు. నాగమయ్య పుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకున్న పారిశుధ్య కార్మికులతో తంగిరాల రామిరెడ్డి, కార్యదర్శి, ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సత్యసాయి సేవా మందిరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సత్య సేవా సమితి సభ్యులు పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న పంచాయతీ కార్మికులకు గౌరవించటం తమ విధి అన్నారు. శీతాకాలం సందర్భంగా వారికి అవసరమైన దుప్పట్లను సత్యసేవా సమితి తరఫున అందించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 50 మంది పారిశుధ్య కార్మికులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కిరణ్, కిశోర్, కుమార్, సత్య సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టుకు మోక్షం ఎప్పుడో?



గుంతలమయమైన కల్వర్టు

దొనకొండ: మండలంలోని రామాపురం–లక్ష్మీపురం గ్రామాలను కలుపుతూ మార్కాపురం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డు చిల్లచెట్లతో నిండిపోయింది. రామాపురం–లక్ష్మీపురం చెరువుకట్ట వద్ద గతంలో నిర్మించిన కల్వర్టు కుంగిపోయింది. ఈ కల్వర్టుకు మోక్షం ఎప్పుడో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు ప్రతి నిత్యం ఈ రహదారి నుంచి ఉదయం, సాయంత్రం తిరుగుతుంటాయి. కల్వర్టు కుంగి పోవటంతో భయంకరమైన గుంత ఏర్పడి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యాయి. అధికారులు ఆ దారి నుంచి వెళ్తుంటారు.. వస్తుంటారు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వర్షం పడిన సమయంలో కల్వర్టు కుంగిన ప్రదేశంలో నీరు నిలబడి ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.